క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన భక్తులు మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. నరసాపురానికి చెందిన గొట్టుముక్కల శ్రీసాయి ఫణీంద్ర వర్మ, మీనా భారతి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఏఈఓ ఎస్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శరత్ చంద్ర విద్యార్థులకు సివిల్స్‌లో ర్యాంకులు



5వ ర్యాంకర్ రుహానీతో ఎండీ శరత్‌చంద్ర

లబ్బీపేట(విజయవాడ తూర్పు): సివిల్స్ ఫలితాల్లో విజయవాడ, హైదరాబాద్‌లోని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీల్లో శిక్షణ పొందిన వారు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు అకాడమీ ఎండీ తోట శరత్ చంద్ర తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన అనన్యరెడ్డి 3వ ర్యాంకు, రుహాని 5వ ర్యాంకు సాధించగా, ఇంకా 16, 19, 42, 61, 91 ఇలా 50వరకు ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. వారిలో 19 ర్యాంకులు తెలుగు విద్యార్థులకు వచ్చాయన్నారు. ఇతర ర్యాంకులు తమ ఆన్‌లైన్ క్లాసెస్, ఢిల్లీ బ్రాంచ్, టెస్ట్ సిరీస్, ఇంటర్వ్యూ గైడెన్స్ నుంచి వచ్చినట్లు తెలిపారు. తెలుగు మీడియం చదివి, కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ సింగరాయకొండకు చెందిన ఉదయ్‌రెడ్డికి 780వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారికి, స్త్రీలకు అత్యధికంగా ర్యాంకులు రావడం సంతోషకరమన్నారు.

శాకంబరిదేవిగా శివకామేశ్వరి అమ్మవారు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన అమ్మవారు మంగళవారం శాకంబరీదేవీగా భక్తుల పూజలు అందుకున్నారు. ఆలయ అర్చకులు వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు రకాల కూరగాయలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

శ్రీరామచంద్రుడికి స్వరాభిషేకం



విజయవాడ కల్చరల్: సురభి కళావేదిక ఆధ్వర్యాన శ్రీరామ నవమి సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద మంగళవారం నిర్వహించిన సినీ భక్తి గీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు కే డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో చంద్రశేఖర్, మల్లీశ్వరి, సుధారాణి, బీహెచ్ కామేశ్వరి, రేష్మ, వీరరాజు భక్తి గీతాలను ఆలపించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, శింగంశెట్టి చంద్రశేఖర్ శ్రీరామచంద్రుని వ్యక్తిత్వం అంశంగా ప్రసంగించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్–3 కార్యాలయంలో మంగళవారం జరిగిన మొబైల్ కోర్టులో 33 కేసులు విచారణ జరిగాయి. రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి బి.విజయ్‌కుమార్‌రెడ్డి జరిమానా విధించారు. రోడ్డుపై చెత్త వేసిన, లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తున్న, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినందుకు సర్కిల్–3 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 33 కేసులను ఆయన విచారించి వారికి రూ. 19,350 జరిమానా విధించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒకసారి జరిమానా విధించాక రెండోసారి కూడా ఆ తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకొని లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఆహ్లాదకరంగా ఉద్యానవనం

- రూ. 15 లక్షలతో అభివృద్ధి పనులు
- ఆరోగ్యకర సమాజానికి ఓపెన్ జిమ్ ఏర్పాటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేటి నగర జీవనంలో ఇరుకు గదులు మానసిక ఒత్తిడి తొలగించడానికి ఉద్యానవనాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. గత టీడీపీ ప్రభుత్వం ఉద్యానవనాలను పట్టించుకోకపోవడంతో అవి అపరిశుభ్రంగా విష కీటకాలకు నిలయంగా మారాయి. మధురానగర్‌లో మూడు ఉద్యానవనాలు ఉన్నప్పటికీ ఒక్కటి కూడా సక్రమంగా లేదు. రైల్వేగేటు సమీపంలోని గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనం ఆర్‌యూబీ పనుల్లో భాగంగా రాకపోకలకు పరిమితం అయ్యింది. ఇక్కడ స్థానికులు సేదతీరే అవకాశం లేకుండా పోవడంతో నగరపాలకసంస్థ ఉద్యానవన శాఖ అధికారులు కొద్దిపాటి మొక్కలను పెంచుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధురానగర్ వాసుల కోసం స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లెక్చరర్స్ కాలనీలోని ముత్తవరపు శ్రీనివాసరావు, నగరాజ కుమారి ఉద్యానవనాన్ని రూ. 15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు. గత ప్రభుత్వ హయాంలో చెత్త చెదారం, ఎండిన మొక్కలతో అపరిశుభ్రంగా మారిన ఉద్యానవనంను నేడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఉద్యానవనం చుట్టూ ప్రహరీగోడను నిర్మించి సుందరంగా తయారు చేశారు. ఉద్యానవనంలో చిన్న పిల్లలు ఆడుకోవడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రజల ఆరోగ్య పరిరక్షణకుగానూ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఉద్యానవనాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ముత్తవరపు శ్రీనివాసరావు, నగరాజ కుమారి ఉద్యానవనంలో ఓపెన్ జిమ్



ఉద్యానవనంలో పచ్చదనం

స్థానికులకు ఎంతో ఉపయోగకరం



డివిజన్‌లో ప్రజల మానసిక ఒత్తిడిని తొలగింప చేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఉద్యానవనం, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడ ఉద్యానవనంలో చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా సంతోషంగా గడిపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా ఓపెన్ జిమ్‌ను మహిళలు, స్థానికులు అధిక సంఖ్యలో వచ్చి ఉపయోగించుకుంటున్నారు.

– కొంగితల లక్ష్మీపతి, కార్పొరేటర్

ఓపెన్ జిమ్ ఏర్పాటు అభినందనీయం



తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యిన ముత్తవరపు శ్రీనివాసరావు, నగరాజ కుమారి ఉద్యానవనాన్ని సుందరంగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉంది. అలాగే ఉద్యానవనంను సకల సదుపాయాలతో తీర్చిదిద్దడంతోపాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది.

– కంభం కొండలరావు, మధురానగర్

సీఎం జగన్ క్షేమంగా ఉండాలని పూజలు

పాయకాపురం(విజయవాడరూరల్): రాళ్ల దాడిలో గాయపడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులు త్వరగా కోలుకొని క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీనగర్‌లోని బాబా మందిరంలో 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం కార్పొరేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకుల ప్రోద్బలంతోనే సీఎం జగనన్న, ఎమ్మెల్యే వెలంపల్లిపై రాళ్ల దాడి చేశారని ఆరోపించారు. త్వరగా కోలుకోవాలని సాయిబాబాకు పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్, కోఆప్షన్ సభ్యుడు నందెపు జగదీష్, ఇన్‌చార్జి షేక్ మస్తాన్, కోఆర్డినేటర్ వీరబాబు, రామిరెడ్డి, బుజ్జి, హైమావతి, సావిత్రి, వెంకట్, మహేష్, సుభానీ, రాధా తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబా గుడిలో పూజ చేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి, నాయకులు

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే ప్రజలందరికి సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్ ప్రజలకు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం 61వ డివిజన్ శాంతినగర్‌లో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన 61వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 12 కోట్లతో పలు అభివృద్ధి పనులు నిర్వహించడం జరిగిందని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కులు, సచివాలయ భవనాలు నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ కోఆర్డినేటర్ నాలం బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అనిల్, హరిసాయి, మధు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్‌లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం కండ్రిక కాలనీ 103 బూత్ ప్రాంతంలో 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపిస్తే వృద్ధులకు ఇంటివద్దకే పింఛన్లు వస్తాయని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, కొక్కిలిగడ్డ నాని, పి.నాగేశ్వరరావు, సీహెచ్ ఆదాం, సీతారామయ్య, మాతా సతీష్, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 29వ డివిజన్ మధురానగర్ ఇందిరా కాలనీలో మంగళవారం కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగమణి, పూర్ణిమ, అక్బర్, సుధాకర్, జాన్సన్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



64వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ



ఇందిరా కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీపతి

క్షేత్రపాలకుడికి తమలపాకులతో అర్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి వారికి మంగళవారం విశేష అభిషేకాలు, తమలపాకులతో అర్చన జరిగింది. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద, దేవస్థాన ఘాట్ రోడ్డులోని స్వామివారి ఆలయం, పాత మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించారు. తొలుత ఆయా ఆలయాల్లో వీరాంజనేయ స్వామివార్లకు ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించగా, ఆలయ ఈఓ కెఎస్.రామారావు పూజలు చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. 18వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీరాముల వారి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.



రావిచెట్టు వద్ద క్షేత్రపాలకుడికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ రామారావు

నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా వేర్వేరు ప్రకటనల్లో శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని జీవితం తరతరాలకు ఆదర్శప్రాయమని, ఏటా వసంత రుతువులో చైత్రశుద్ధ నవమి రోజు వైభవంగా జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపుకోసం రాష్ట్రంలోని ఆజాద్ ముస్లిం కమిటీ నాయకులు, సభ్యులంతా కష్టపడి పనిచేయాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. సింగ్‌నగర్‌లోని ఆ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని ప్రోత్సాహాన్ని అందించారని అన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేసే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి ఆజాద్ ముస్లిం కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు షేక్ సాజిద్‌అలీ, ఎండీ కాలేషా, సయ్యద్ మౌలాలి, షేక్ మస్తాన్, షేక్ బిలాల్, సోహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాములు ఆదర్శ దంపతులు



విజయవాడ కల్చరల్: సీతారాములు ఆదర్శ దంపతులని ఆధ్యాత్మిక వేత్త మరదూరి నరసింహాచార్యులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ సప్తాహ కార్యక్రమాలు మంగళవారం ముగిసాయి. ఈ కార్యక్రమంలో రామాయణం–జాతికి సందేశం అంశంగా ఆయన ప్రసంగించారు. భారతీయ వివాహ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. శ్రీ రాముని సత్య సంధత, పితృవాక్య పరిపాలన, సీతాదేవి కష్ట సమయంలోనూ శ్రీరామ చంద్రుడిని అనుసరించడం వంటి అంశాలను వివరించారు. భారతీయుల ఆరాధ్య దైవం శ్రీరామచంద్రుడని వివరిస్తూ కోట్లాది భారతీయులు ఆయనను ఆదర్శ పురుషుడిగా భావిస్తారన్నారు. తమ శక్తి మేరకు శ్రీరామ నవమిని భక్తిగా నిర్వహించుకుంటారని తెలిపారు. కార్యక్రమాన్ని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ నిర్వహించారు. నరసింహాచార్యులను ఆత్మీయంగా సత్కరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గ్యాస్ లీక్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఏర్పడే అగ్ని ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు వివరించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని కేఎల్ రావు పార్కు సమీపంలోని పలు అపార్టుమెంట్ వాసులకు అవగహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇళ్లలో వినియోగించే గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్ లీకవుతుందని, లీకేజీని చిన్నపాటి జాగ్రత్తలు పాటించి అరికట్టవచ్చునని వివరించడంతో పాటు ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. అంతే కాకుండా తరచూ గ్యాస్ ట్యూబ్‌ను మార్చుకుంటూ ఉండాలని, ఏడాదికి ఒకసారి కొత్త గ్యాస్ లైటర్ తెచ్చి వినియోగించుకోవాలని సూచించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. రాష్ట్ర సచివాలయం నుంచి వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపుతున్నామన్నారు. వేసవిలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నీటి నిల్వలను ఆధారం చేసుకుని వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నామని అన్నారు. శివారు గ్రామ ఆవాసాలలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన నీటి సంరక్షణ పనులను పూర్తి చేస్తున్నామని వివరించారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు షెడ్స్, తాగునీరు వంటి సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం ఆరు నుంచి 11 గంటలలోపు పనులను పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఢిల్లీరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జె.సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డీవీ రమణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు అండగా నిలవాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాజకీయంగా వైఎస్సార్ సీపీని ఎదుర్కొనే ధైర్యం లేక చంద్రబాబు, బొండా ఉమాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడులు చేయించి నీచరాజకీయాలకు తెరలేపారని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుకు మద్దతుగా వెలంపల్లి సోదరులు వెలంపల్లి రాఘవ నర్సింహారావు, రామకృష్ణలతో కలిసి స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించారు. నిరుపేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నకు అందరూ అండగా నిలబడాలని, ఫ్యాను గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యే, ఎంపీగా పోటీచేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను అఖండ మెజార్టీలతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కర్నాటి రాంబాబు, బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, ఎండీ ఇస్మాయేల్, ఫాతిమా, సిరిశెట్టి రాజా, షేక్ సుభాని, బాబు తదితరులు పాల్గొన్నారు.

58వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థించిన వెలంపల్లి సతీమణి శ్రీవాణి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని నానిల అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ వెలంపల్లి సతీమణి శ్రీవాణి డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి 58వ డివిజన్‌లో ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకురాలు వరలక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వాంబేకాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, వెలంపల్లి సోదరులు, వైఎస్సార్ సీపీ నాయకులు



58వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి సతీమణి శ్రీవాణి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి కందుకూరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ సాహితీవేత్త, స్త్రీ జనోద్ధారకుడు, సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి అని కొనియాడారు. ఆ కాలంలోనే మహిళలు సమాజంలో ఉన్నతంగా ఉండాలని దానికి అనుగుణంగా పనిచేసిన మహోన్నత వ్యక్తి వీరేశలింగం పంతులు అని అన్నారు. ఆయన బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళ అభ్యుదయానికి, సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీ కేవీ సుందర్‌రెడ్డి, రాష్ట్ర మహిళ కార్యదర్శి లఖంరాజు సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు బల్లం కిషోర్, కమ్మిలి రత్నకుమార్, దత్తు, దుర్గారావు, ఎం.కన్నా, వెంకటరామిరెడ్డి, ఎస్కే ఖాదర్, స్వామి, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు



కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ గౌతంరెడ్డి

22 నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22వ తేదీ నుంచి నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9.30గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఎంబీ విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ యూవీ రామరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ బోధనలో 20 ఏళ్ల అనుభవంతో పాటు అనేక కార్పొరేట్ కంపెనీలలో సెమినార్‌లు నిర్వహించిన పాగోలు రాజు క్లాసులు తీసుకుంటారని తెలిపారు. ఈ క్లాసులు రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 21వ తేదీలోగా తమ కార్యాలయంలో గాని, 0866 2578044, 94900 98408 నంబర్లలో గాని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉద్యోగులు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో శంకర విజయం నృత్య రూపకం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం శంకర విజయం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఒంగోలుకు చెందిన ఎస్‌వీ శివకుమారి బృందం నృత్య రూపకాన్ని ప్రదర్శించగా, వారిని ఆలయ ఈఓ కెఎస్.రామారావు అభినందించారు. ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని ధర్మపథం వేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య రూపకాన్ని ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు.

